క్లుప్తంగా

మానవతా సంస్థకు రూ. 5,116 విరాళం

పీలేరురూరల్ : మానవతా స్వచ్ఛంద సంస్థకు పీలేరు పట్టణం ప్రశాంత నగర్‌కు చెందిన ఉపాధ్యాయులు శెట్టి సుబ్రమణ్యం, సద్దల పుష్పలత రూ. 5116 విరాళం అందజేశారు. శనివారం శెట్టి సుబ్రమణ్యం తల్లి చెంగమ్మ ఐదోవర్ధంతి సందర్భంగా విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవతా సంస్థ సభ్యులు రామచంద్ర, సురేష్, రహత్‌బాసా, జయపాల్‌రెడ్డి, తాతయ్య, సుధాకర్‌బాబు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

11వ తరగతిలో చేరడానికి దరఖాస్తు చేసుకోండి

మదనపల్లె సిటీ : మదనపల్లె సమీపంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరానికి 11వతరగతిలో ఖాళీగా ఉన్న సీట్లకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని విద్యాలయ ప్రిన్సిపాల్ గీత తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి పాసైన విద్యార్థులు ఈనెల 10వతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తిగల విద్యార్థులు WWW,navodaya.gov.in అనే వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని తదుపరి పూర్తి చేసిన దరఖాస్తును విద్యాలయ మెయిల్ ఐడీ jnvcexamdept2023@fmai.com కి లేదా కార్యాలయంనకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల లోపు తమ దరఖాస్తును సమర్పించాలన్నారు.

అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో సీట్ల భర్తీ

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణ సమీపంలోని చంద్రకాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో వివిధ తరగతులలో మిగిలిన సీట్ల భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ మల్లీశ్వరి తెలిపారు. ఇందులో 5వ తరగతిలో ఎస్సీ విభాగంలో 22 సీట్లు, 9వ తరగతిలో బీసిలో ఒక సీటు, ఎస్‌సి విభాగంలో నాలుగు సీట్లు ఉన్నాయన్నారు. వీటికి అర్హతగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సీటు కావాల్సిన వారు వారి ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలు,ఆధార్‌లతో నేరుగా పాఠశాల కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

పీలేరు రూరల్ : గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ బలరామరాజు, డీపీహెచ్‌ఎన్‌వో శోభలత అన్నారు. శనివారం మండలంలోని రేగళ్లు పీహెచ్‌సీ పరిధిలో దొడ్డిపల్లె విలేజ్ క్లినిక్‌ను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలింతలు, గర్భవతుల నమోదు కార్యక్రమం వందశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. శివరామపురం జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ మునీశ్వర్, డాక్టర్ కె. రాధామాధవి, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ నారసింహుడికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ : మండలంలోని గుర్రంకొండ, తరిగొండ గ్రామాల్లో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయాల్లో స్వామివార్లకు విశేషపూజలు నిర్వహించారు. శనివారం టీటీడీ వారి ఆధ్వర్యంలో తరిగొండ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని రంగు రంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. చారిత్రాత్మక గుర్రంకొండ కోటలోని శ్రీ నృసింహస్వామి ఆలయంలో వేకువజామున అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు చేరుకొని స్వామివార్లను సేవించుకొన్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, ఆలయఅర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నియామకం

పీలేరురూరల్ : వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా మేకల మధుసూదన్ రెడ్డిని నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. పెద్దగొట్టిగల్లుకు చెందిన మేకల మధుసూదన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి చేసిన కృషిని దృష్టిలో ఉంచుకుని పార్టీ సోషల్ మీడియా జాయింట్ సెక్రటరీగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పరామర్శ

కేవీపల్లె : అడవిపందుల దాడిలో గాయపడిన కొత్తపు ప్రభాకర్‌రెడ్డిని రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు నల్లారి తిమ్మారెడ్డి పరామర్శించారు. మండలంలోని కేవీపల్లెకు చెందిన కొత్తపు ప్రభాకర్‌రెడ్డి ఇటీవల వ్యవసాయ పనుల నిమిత్తం తన సొంత మామిడితోపుకు వెళ్లాడు. మామిడితోపులో కూలీలు పాదులు తీస్తుండగా అడవిపంది ఇద్దరు మహిళలపై దాడి చేసింది. అక్కడే ఉన్న ప్రభాకర్‌రెడ్డి అడవిపందిని తరిమికొట్టే ప్రయత్నం చేశాడు. ఆయనపై కూడా దాడి చేసి పారిపోవడంతో ఆయన గాయపడ్డాడు. చికిత్స పొంది ఇంటి వద్ద ఉన్న ప్రభాకర్‌రెడ్డిని శనివారం నల్లారి తిమ్మారెడ్డి పరామర్శించారు.

అక్రమ కేసులు..

చంద్రబాబు నీచబుద్ధికి నిదర్శనం

- మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టుపై నిరసనలు
- ఎంపీ కోసం ఆలయాలు, మసీదుల్లో పార్టీ శ్రేణుల ప్రార్థనలు



గర్నిమిట్ట యల్లమ్మ ఆలయంలో కొబ్బరికాయలు కొడుతున్న నాయకులు



కలకడ : శ్రీకామాక్షిసమేతసిద్దేశ్వరస్వామి ఆలయంలో పూజలు



గుర్రంకొండ: రెడ్డెమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు



వాల్మీకిపురం: సాయిబాబా మందిరంలో మాజీ ఎమ్మెల్యే చింతల, నాయకులు



పీలేరు : వెంకటేశ్వరస్వామి ఆలయంలో టెంకాయలు కొడుతున్న నాయకులు



కలికిరి ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కేవీపల్లె : ఎలాంటి తప్పు లేకపోయినా ఉద్దేశపూర్వకంగా వైఎస్సార్‌సీపీ నేతలపై కక్షకట్టి అక్రమ కేసులు బనాయించడం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నీచబుద్ధికి నిదర్శనమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుండ్లూరు జయరామచంద్రయ్య అన్నారు. శనివారం అక్రమ మద్యం కేసులో అరెస్ట్ కాబడి జైల్లో ఉన్న రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి సురక్షితంగా విడుదల కావాలని కోరుతూ మండలంలోని గర్నిమిట్ట శ్రీ యల్లమ్మ ఆలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 101 కొబ్బరి కాయలు కొట్టి పూజలు చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది ఎదురైనా నేనుంటా అండగా అని సహాయ సహకారాలు అందించి పేదల పెన్నిధిగా ఉన్న ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయడం అన్యాయమన్నారు. ఎంపీ కడిగిన ముత్యంలా అక్రమ కేసు నుంచి బయటపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఆనంద్‌రెడ్డి, రాంప్రసాద్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పి. ద్వారకనాథరెడ్డి, దిగవగళ్ల శ్రీనివాసులురెడ్డి, సి.కె. యర్రమరెడ్డి, కోర్టు సుబ్బారెడ్డి, రవిచంద్రారెడ్డి, డాబా బాబు, వెంకటేశ్వర్ రెడ్డి, గణపతి రెడ్డి, కొండారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, కిరణ్, అమీర్‌బాషా, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి కోసం ప్రత్యేక పూజలు

కలకడ : రాజంపేట పార్లమెంటు సభ్యులు ఎంపీ మిథున్‌రెడ్డి కోసం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కమలాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీకామాక్షిసమేత సిద్దేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు, అలాగే దర్గా వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. లిక్కర్ స్కాం అంటూ అక్రమ కేసులు నమోదు చేసి పార్లమెంటు సభ్యులకు ఇచ్చే గౌరవం లేకుండా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు దారుణమన్నారు. అక్రమ కేసునుంచి ఎంపీకి విముక్తి కలగాలని కోరుకున్నారు. కార్యక్రమంలో కోన సర్పంచ్ జల్లా రాజగోపాల్‌రెడ్డి, సర్పంచ్ రామచంద్ర, వెంకటప్రసాద్‌రెడ్డి, షావత్‌అల్లిఖాన్, శ్రీనివాసులురెడ్డి, జిలానీబాష, కెఎస్‌మస్తాన్, కుమార్‌నాయుడు, బాబురెడ్డి, వెంకటేశ్వరనాయుడు, కుమార్‌రెడ్డి, రవి, సద్దాం, మోహన్‌రాజ, హరినాథరెడ్డి, అంజన్‌కుమార్, రామాంజులు, వెంకట్రమణరెడ్డి, జాఫర్, నటరాజ్, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్రంకొండలో..

గుర్రంకొండ : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి క్షేమంగా ఉండాలని కోరుకొంటూ మండలంలోని మర్రిపాడు గ్రామంలోని శ్రీ అంజినేయస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం స్థానిక ఆలయంలో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు చేరుకొని స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మిథున్‌రెడ్డికి వెంటనే బెయిల్ మంజూరు కావాలని ఆ భగవంతుడ్ని ప్రార్థించామన్నారు. అక్రమ కేసుల నుంచి విముక్తి పొందాలని కోరుకున్నామని అన్నారు.

రెడ్డెమ్మ తల్లి ఆలయంలో..

ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కోసం మండలంలోనిచెర్లోపల్లె గ్రామంలోని శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయంలోనూ, మర్రిపాడు గ్రామంలోని శ్రీ ఆంజినేయస్వామి ఆలయంలోనూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్డెమ్మకొండ మాజీ చైర్మ రామచంద్రారెడ్డి, మైనార్టీ నాయకురాలు షెహనాజ్, నాయకులు బాబునాయుడు,నజీర్, ఆర్వీరమణ, పెదరమణ, పసలశ్రీనివాసులు, మల్లప్పనాయుడు, ఈశ్వరమ్మ, ఉస్మాన్‌వలీ, దివాన్‌జాకీర్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసు నుంచి విముక్తి కలగాలి

కలికిరి(వాల్మీకిపురం) : రాజంపేట ఎంపీ పీవీ మిథున్ రెడ్డికి అక్రమ లిక్కర్ కేసు నుంచి విముక్తి కలిగి జైలు నుంచి విడుదలవ్వాలని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో వాల్మీకిపురం సాయినగర్‌లోని షిర్డీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ జరగని లిక్కర్ స్కామ్‌పై ఎంపీ మిథున్ రెడ్డిని అక్రమంగా అరెస్టు చేసి జైలు నిర్బంధించడం దారుణమన్నారు. వరుసగా మూడు పర్యాయాలు ఎంపీగా గెలుపొందిన ఆయన ఇప్పటి వరకు ఎటువంటి అవినీతి మచ్చలేని నాయకుడుగా పేరొందారని, అటువంటి మిథున్ రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక కూటమి నేతలు అక్రమంగ కేసు బనాయించారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు నీళ్ళ భాస్కర్, బిడ్డల కేశవరెడ్డి, పులి శివకుమార్‌రెడ్డి, గంగులమ్మ, బుగ్గల ఆనంద, శ్రీధర్ రాయల్, కువైట్ ఇబ్రహీరం, ఇర్ఫాన్, బబ్లూ, రవి, సుధా, మహేశ్వర్‌రెడ్డి, గంగిరెడ్డి, రఘు, రాజాబాబు, చంద్రశేఖర్, చలపతి, శ్రీరాములు, మదన్మోహన్, ముభారక్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి విడుదల కావాలని..

పీలేరు : అక్రమ లిక్కర్ కేసులో అరెస్ట్ అయి రాజమండ్రి జైల్లో ఉన్న ఎంపీ మిథున్‌రెడ్డి విడుదల కావాలని శనివారం స్థానిక కడప రోడ్డులోని వెంకటేశ్వరస్వామి ఆలయం, జీవీ నగర్‌లో శ్రీ పద్మావతి ఆండాల్ సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించి 101 టెంకాయలు కొట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజకీయంగా పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఎదుర్కొనలేకనే అక్రమ కేసులు ఎంపీ మిథున్‌రెడ్డిని వేధిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చక్రధర్, లోకనాథరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, భువనేశ్వర్‌రెడ్డి, గంగిరెడ్డి, అమరనాథనాయుడు, అశోక్‌నాయుడు, గోవర్ధన్‌రెడ్డి, వెంకటప్పనాయుడు, రామస్వామిరెడ్డి, వినాయకం, సురేంద్రరెడ్డి, సి.కె. వెంకటేష్, సహదేవరెడ్డి, చిన్నబాబు, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

ఇలవేల్పు వీరభద్రస్వామి ఊరేగింపు

- రూ.1.07 కోట్లతో నూతన ఆలయ నిర్మాణం
- విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ప్రారంభం

తంబళ్లపల్లె : మండలంలోని కన్నెమడుగు పంచాయతీ చిన్నమాచిరెడ్డిగారిపల్లెలో వెలసిన ఆవుదేవర దేవస్థానం శ్రీ వీరభద్రస్వామి ఆలయాన్ని రూ.1.07 కోట్లతో నిర్మించారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కృషితో దేవదాయశాఖ ఆధ్వర్యంలో నూతన ఆలయాన్ని నిర్మించారు. కన్నెమడుగు దాయాదులు, గ్రామ ప్రజల సహకారంతో నూతన వీరభద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాలు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆగమశాస్త్రం ప్రకారం వినాయకపూజ, యజమాన సంకల్పం, గ్రామ శాంతి, వాస్తు శాంతి హోమాలు,కలశారాధన వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ క్రమంలో మొదటి రోజు శనివారం చిన్నమాచిరెడ్డిగారిపల్లె నూతన ఆలయం నుంచి స్వామిని చాందినీ బండిపై విద్యుత్‌దీపాలతో ప్రత్యేక అలంకరణ చేసి పంచాయతీలోని 16 పల్లెల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ మునిరాజ, కన్నెమడుగు దాయాదులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బీఎస్పీ మండలాధ్యక్షుడి ఎన్నిక

ములకలచెరువు : బీఎస్పీ మండలాధ్యక్షుడిగా వేపూరికోటకు చెందిన పూడు మహేష్‌ను ఏకాగ్రీవంగా ఎన్నుకున్నారు. వేపూరికోటలో శనివారం నిర్వహించిన సమావేశంలో బీఎస్పీ తంబళ్లపల్లె అధ్యక్షుడు మల్లికార్జున, అసెంబ్లీ ఇన్‌చార్జ్ సోముశేఖర్ ఈ ఎన్నికను నిర్వహించారు. మండలంలో పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని మహేష్ పేర్కొన్నారు.

హామీని విస్మరించి ప్రజలపై భారం మోపుతారా

– ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సాంబశివ

మదనపల్లె : ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపమని, చార్జీలు తగ్గేలా చూస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన చంద్రబాబు ప్రజలపై మోపేందుకు సిద్ధంగా ఉన్న రూ.12,771 కోట్ల భారాన్ని వెనక్కు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. ఈనెల 5న నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలపై శనివారం ఆ సంఘ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రజలపై భారం వేసేందుకు ప్రభుత్వానికి తెలియకుండా ప్రతిపాదనలు పంపాయా అని ప్రశ్నించారు. 2024–25 ఏడాదిలో యూనిట్‌కు 40పైసలు చొప్పున ఏడాదిలో రూ.2,787 కోట్లను వినియోగదారుల నుంచి వసూలు చేశారన్నారు. సమావేశంలో పట్టణ కార్యదర్శి తిరుమల, చలపతి నాయుడు, భాస్కర్, రాధ పాల్గొన్నారు.

బాబు పాలనలో భవిష్యత్తు అంధకారం



పెద్దతిప్పసముద్రం : చంద్రబాబు మోసాలపై ఇంటింటా ప్రచారం



పెద్దమండ్యం : కూలీలకు చంద్రబాబు మోసాలను వివరిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

పెద్దతిప్పసముద్రం : చంద్రబాబు అధికారంలోకి వచ్చి ప్రజలకు భవిష్యత్తు లేకుండా చేసారని ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ ఉంగరాల శివన్న, మండల కన్వీనర్ కొట్టి మల్లికార్జున, వైస్ ఎంపీపీ శోభా శంకర్ అన్నారు. బాబు ష్యూరిటీ–భవిష్యత్తుకు నో గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని బూర్లపల్లి తుమ్మకుంట, పోతుపేట పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు పర్యటించారు. ఇంటింటా తిరిగి కూటమి పాలనా విధానంపై ప్రజాభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏ పథకం కూడా సక్రమంగా అమలు చేయక రాష్ట్ర ప్రజలను నిలువునా ముంచారని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేని సీఎంకు రాష్ట్రాన్ని పాలించే హక్కు లేదన్నారు. ఓట్ల కోసం అమలు కాని హామీలిచ్చిన చంద్రబాబు మోసాలను ఎండగట్టాలని ప్రజలకు సూచించారు. ప్రతి మహిళకు నెలకు రూ.1,500లు, 50 ఏళ్ళ వయసు నిండిన వారికి పెన్షన్ సౌకర్యం లాంటి హామీలను కూడా అమలు చేయకపోవడం హాస్యాస్పదమన్నారు. కార్యక్రమంలో బూర్లపల్లి సర్పంచ్ సుబ్బిరెడ్డి, లోకేష్‌రెడ్డి, ఎంపీటీసీలు నాగార్జునరెడ్డి, రవి, నాయకులు కేవీ రమణ, బసిరెడ్డి, కల్లేగారి మంజు, వెంకట్, వెంకటరెడ్డి, భాస్కర్‌నాయుడు, శ్రీనివాసులు, ప్రదీప్‌రెడ్డి, మునిరెడ్డి, మంజునాథ్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, నారాయణస్వామి, ఎల్ బాబు, రాజశేఖర్, పుజేల్ పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలో కరువు కాటకాలు

పెద్దమండ్యం : చంద్రబాబు పాలనలో కరువు కాటకాలు తప్పవని ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక అన్నారు. మండలంలోని కలిచెర్ల, ఎస్‌హోపల్లె, కోటకాడపల్లె, గుర్రంవాండ్లపల్లె గ్రామాలలో శనివారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మోసపూరిత వాగ్దానాలు చేసి చంద్రబాబు అధికారంలోకి రాగానే ప్రజలు కరువు బారిన పడ్డారన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు, పథకాలు ఎగవేతపై ప్రజలకు వివరించారు. ఎస్‌హోపల్లె వద్ద పొలం పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లిన ప్రజాప్రతినిధులు, నాయకులకు చంద్రబాబు మోసాలు వివరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గుర్రం రమేష్, సర్పంచ్‌లు సుధాకరనాయుడు, భూదేవి, జింకా విశ్వనాథ, పద్మావతమ్మ, సోదనపల్లె బాషా, కంటి విశ్వనాథరెడ్డి, ఎంపీటీసీలు బోడెం రవితేజ, మంచూరి జయరాం, మండల కన్వీనర్ కన్నపు పెద్దరెడ్డెప్పరెడ్డి, నాయకులు కేశవ, తిరుపాల్‌నాయక్, గుర్రం కిషోర్, చాను పాల్గొన్నారు.

‘అన్నదాత సుఖీభవ’ సద్వినియోగం చేసుకోవాలి

– సబ్ కలెక్టర్ మేఘస్వరూప్



అన్నదాత సుఖీభవ పథకం మెగా చెక్కును అందిస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె రూరల్ : రైతు కుటుంబాలకు పెట్టుబడి సాయం అందించేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్నదాత సుఖీభవ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. శనివారం పట్టణంలోని జేసీఎం కమ్యూనిటీ హాల్‌లో అన్నదాత సుఖీభవ, పీయం కిసాన్ 2025–26 సంవత్సరానికి సంబంధించి మొదటివిడత నిధుల విడుదలకు సంబంధించి మదనపల్లె నియోజకవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ మాట్లాడుతూ...రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రూపొందించిన విశిష్ట పథకం అన్నదాత సుఖీభవ అన్నారు. వర్షాకాలంకు ముందు సరైన సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందిస్తున్న ఈ ఆర్థిక సహాయంతో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసుకోవచ్చన్నారు. సాగు ఖర్చులకు ఉపయోగించుకోవచ్చన్నారు. కేంద్రం అమలుచేస్తున్న పీఎం కిసాన్‌కు అనుసంధానంతో రాష్ట్రప్రభుత్వం మొదటివిడతగా ఒకొక్కరికి రూ.7వేల వంతున నగదును రైతుల ఖాతాల్లో జమచేస్తున్నట్లు తెలిపారు. మదనపల్లె నియోజకవర్గానికి సంబంధించి 20,162 మంది లబ్ధిదారులకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.5వేలు, పీఎం కిసాన్ కింద రూ.2వేలు మొత్తం కలిపి 14కోట్ల 11లక్షల రూపాయలను నేరుగా డీబీటీ పథకం కింద ఈకేవైసీ చేయించుకున్న రైతుల ఖాతాల్లో జమచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నవీన్, నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు, గౌడ్ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి గౌడ్, సురేష్, టౌన్‌బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, నందకుమార్, గంగారపు నవీన్, రాటకొండ మధుబాబు, జంగాల శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

కలికిరి(వాల్మీకిపురం) : వాల్మీకిపురం మండలం ఇందిరమ్మకాలనిలోని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డీహెచ్ చంద్రకళ తెలిపారు. ఎస్సీ బాలికలకు 5వ తరగతిలో 25, 7వ తరగతిలో 08 సీట్లు ఉన్నాయని, దరఖాస్తు దారులు ఆదాయం, కుల ధృవీకరణ, ఆధార్, విద్యార్హత పత్రాలతో సంప్రదించాలని ఆమె కోరారు.

తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష

గుర్రంకొండ : తల్లిపాలే బిడ్డకు శ్రీరామ రక్ష అని సీడీపీఓ భారతి, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ అన్నారు. శనివారం మండలంలోని మర్రిపాడు గ్రామ సచివాలయంలోతల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని తల్లులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలకు మించి ప్రత్యామ్నాయం ఏది లేదన్నారు. తల్లిపాలు కల్తీలేనివని, అవి దేవుడిచ్చిన వరమన్నారు. బలవర్ధకమైన ఆహారం బిడ్డకు మొదటగా తల్లిపాల నుంచే వస్తుందన్నారు. ప్రతి తల్లి ఆరునెలల పాటు బిడ్డకు తప్పకుండా పాలు ఇస్తే ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి లక్ష్మీప్రసన్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి, తల్లులు పాల్గొన్నారు.

పోతపాలు వద్దు–తల్లిపాలు ముద్దు

కలకడ : పోతపాలు వద్దేవద్దు–తల్లిపాలే ముద్దు అని డాక్టర్ లక్ష్మీప్రసన్న అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా శనివారం మర్రిపాడు, కదిరాయచెర్వు పంచాయతీలలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించి తల్లిపాల విశిష్టతను తెలియజేశారు.

ముర్రుపాలతో రోగ నిరోధకశక్తి పెంపు

పెద్దతిప్పసముద్రం : బిడ్డ ఎదుగుదలకు తల్లి ముర్రుపాలు ఎంతో దోహదపడతాయని, కాన్పు అయిన గంట లోపు బిడ్డకు ముర్రు పాలు పట్టిస్తే రోగ నిరోధకశక్తి పెరుగుతుందని బి.కొత్తకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో భాగ్యమ్మ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని టూ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లి పాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ హిజాద్ ప్యారీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



కలకడ : తల్లిపాల విశిష్టతను తెలియజేస్తున్న డాక్టర్ లక్ష్మీప్రసన్న

తల్లిపాలతో వ్యాధి నిరోధక శక్తి

ములకలచెరువు : తల్లిపాలు పురిటి బిడ్డకు శ్రీరామరక్ష అని ఐసీడీఎస్ సూపర్ వేజర్ మౌలాబి అన్నారు. శనివారం మండలంలోని నాయనచెరువుపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వేజర్ మాట్లాడుతూ... ఈ నెల 8 వరకు ఈ వారోత్సవాలు మండల వ్యాప్తంగా నిర్వహిస్తామని చెప్పారు. తల్లిపాలు బిడ్డకు వ్యాధినిరోధక శక్తి పెంచుతుందని, గర్భవతులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

తల్లిపాల వారోత్సవ ర్యాలీ

పీలేరు : శిశువు పుట్టిన గంటలోపు ఇచ్చే తల్లి ముర్రుపాలు అన్ని అంటువ్యాధుల నుంచి శ్రీరామరక్షగా పని చేస్తుందని తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీగిరీష అన్నారు. శనివారం తలపుల అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముర్రుపాలు బిడ్డ మెదస్సును పెంచడమే గాకుండా న్యుమెనియా, డయేరియా లాంటి వ్యాధుల నుంచి రక్షిస్తాయని తెలిపారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

– డీఎస్పీ మహేంద్ర



మదనపల్లె సిటీ : ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మదనపల్లె డిఎస్పీ మహేంద్ర అన్నారు. స్థానిక చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం యాంటీ ర్యాగింగ్ సెల్, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో యాంటీ ర్యాగింగ్, సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.విద్య వ్యవస్థలో ర్యాగింగ్‌పై నిషేధం ఉందని స్పష్టం చేశారు. ఎవరైనా ర్యాగింగ్‌లు చేసిన ఎలాంటి ఇబ్బందులు పెట్టిన వెంటనే అధ్యాపకులకు తెలియజేయాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడి తమ జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని మీ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. తాలూకా సీఐ కళా వెంకటరమణ మాట్లాడుతూ సైబర్ నేరాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయన్నారు. వాటికి గురికాకుండా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యక్తిగత సమాచారం లీక్ కాకుండా జాగ్రత్తలు పాటించాల్సిన అవసరాన్ని వివరించారు. కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి మాట్లాడుతూ నేటి యువత ర్యాగింగ్ వంటి అవాంఛనీయ చర్యలకు వ్యతిరేకంగా నిలబడి సాంకేతిక పరిజ్ఞానాన్ని సమాజ హితానికి ఉపయోగించుకోవాలన్నారు. విద్యార్థులు సమగ్ర అభివృద్ధి కోసం స్నేహపూర్వక వాతావరణం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో కాలేజి ప్రిన్సిపాల్ పి.రాయుడు, డీన్ భాస్కర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ అరుణ్‌కుమార్‌రెడ్డి యాంటీ ర్యాగింగ్ సెల్ కో ఆర్డినేటర్ డాక్టర్ రోషిని,అధ్యాపకులు పాల్గొన్నారు.